క్లుప్తంగా

శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా కుంకుమార్చనలు, చండీ హోమం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. విశాఖపట్నం నుంచి వచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి చీరల వేలం జరిగింది. భక్తులు వేలంలో పాల్గొని అమ్మవారి చీరలను దక్కించుకున్నారు.

మానవ జాతికి దివ్యమార్గం అందించేది భగవద్గీత



విజయవాడకల్చరల్: మానవ జాతికి దివ్య మార్గం అందించేది భగవద్గీత అని ఆధ్యాత్మిక వేత్త రాఘవ గోస్వామి అన్నారు. అఖిల భారతీయ సంస్థ సంస్కార భారతి ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా అయోధ్యనగర్‌లోని హైందవి కార్యాలయంలో బాల బాలికలకు భగవద్గీత శ్లోక పఠన కార్యక్రమం నిర్వహించారు. రాఘవ గోస్వామి మాట్లాడుతూ కర్తవ్య నిర్వహణలో ఎదురయ్యే సమస్యలకు ఈ నాటికి.. ఏ నాటికి ప్రమాణంగా నిలిచేది భగవద్గీత మాత్రమేనన్నారు. రామరాఘవ దాసు మాట్లాడుతూ స్వ ధర్మం శ్రేయస్కరమని, ఆచరణీయమైనది స్వధర్మం ప్రమాదంలో పడినప్పుడు ఏయుగంలోనైనా అవతరిస్తానని భగవంతుడు వివరించాడన్నారు. భగవద్గీత నిత్య పఠనీయ గ్రంథం కావాలని సూచించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని భగవద్గీత శ్లోకపఠనం చేశారు. లక్ష్మీనారాయణ, పద్మావతి గీత మన గీత మారుస్తుందని తెలిపారు. విద్యార్థులకు నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమాలను నాగలక్ష్మి, సరస్వతి నిర్వహించారు.

సాంస్కృతిక, సాహిత్య వికాసానికి అరసం కృషి



విజయవాడకల్చరల్: సాంస్కృతిక, సాహిత్య వికాసానికి అభ్యుదయ రచయితల సంఘం కట్టుబడి ఉందని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ప్రచురించిన దేవీప్రియ కవితా సంపుటి, రేవతీదేవి కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమాన్ని మొగల్రాజపురంలోని శిఖరా స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అభ్యుదయ రచయితల సంఘానికి సుదీర్ఘమైన సాహిత్య చరిత్ర ఉందన్నారు. మరుగున పడిన అనేక గ్రంథాలను వెలుగులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. దేవీప్రియ కవితను ఖాదర్ మొహిద్దీన్ ఆవిష్కరించారు. సంపాదకుడు బండ్ల మాధవరావు మాట్లాడుతూ దేవీ ప్రియ కవిత్వంలో సామాజిక చిత్రీకరణ కనిపిస్తోందన్నారు. రేవతీదేవి కవితా సంపుటిని కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత పి.సత్యవతి ఆవిష్కరించారు. సాహితీవేత్త బాలాంత్రపు ప్రసూన కవితా సంపుటి విశేషాలు వివరించారు. అరసం కీలక బాధ్యులు వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ.. ఈ తరం కోసం అరసం కృషి చేస్తోందన్నారు. అరసం జిల్లా కార్యదర్శి పరచూరి అజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెలమ కులాన్ని కించపరిచిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తమ కులాన్ని కించపరుస్తూ తెలంగాణ రాష్ట్రం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలను వెలమ సంక్షేమ సంఘం ఖండించింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీనగర్‌లోని వెలమ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశం సంఘం అధ్యక్షుడు ఘంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి నేటి వరకు వెలమ కులంలో ఎందరో ప్రముఖులు దేశానికి సేవ చేశారన్నారు. అటువంటి వెలమ కులాన్ని కించపరుస్తూ అసభ్యకర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే తక్షణమే జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో వైరల్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్‌లో ఏ ఒక్కరూ తమ కులంపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సమావేశంలో వెలమ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సిరివరపు కిరణ్‌కుమార్, కోశాధికారి ఘంటా శ్రీనివారావు, రుత్తుల అప్పలస్వామి, జి.గోవర్ధన్, ఎన్ రామారావు, బి.విజయలక్ష్మి, మూకల గణేష్ నాయుడు, మోటుపల్లి విఠలరావు తదితరులు పాల్గొన్నారు.

బిక్కుబిక్కుమంటూ విధులు

- ప్రమాదకరంగా ఏపీ రాష్ట్ర ఆరోగ్య రవాణాసంస్థ సహాయ రవాణా అధికారి కార్యాలయం
- శిథిలమైన కార్యాలయంతో బెంబేలు
- చర్యలు తీసుకోవాలని వినతి



ఏపీ రాష్ట్ర ఆరోగ్య రవాణా సంస్థ సహాయ రవాణా అధికారి కార్యాలయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ సీకే రెడ్డి రోడ్డులోని ఏపీ రాష్ట్ర ఆరోగ్య రవాణాసంస్థ సహాయ రవాణా అధికారి కార్యాలయం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఆరు జిల్లాలకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ వాహనాలకు ఇక్కడ మరమ్మతులు చేసేవారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం కొత్త వాహనాలు కొనుగోలు చేయకపోవటం, పాత వాహనాలు మరమ్మతులకు సైతం పనికి రాకపోవటంతో కాంట్రాక్టు పద్ధతిలో ప్రైవేట్ వాహనాలు వినియోగిస్తున్నారు. దీంతో ఇక్కడ ఉన్న సిబ్బందికి పని లేకుండా పోయింది. అలాగే కార్యాలయం అద్దె కూడా తక్కువగా ఉండడంతో ఈ కార్యాలయాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. విశాలంగా ఉండే ఈ కార్యాలయానికి ఎన్నో సంవత్సరాలుగా మరమ్మతులు చేయకపోవటంతో బీటలు వారి ప్రమాదకరంగా మారింది. ఒకప్పుడు 30 మందికి పైగా పనిచేసే ఇక్కడ ప్రస్తుతం ఏడుగురు మాత్రమే పనిచేస్తున్నారు. వారిలో ఇద్దరు ప్రధాన కార్యాలయంలో డెప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడు కూలుతుంతో తెలియని ఈ భవనంలో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

బీటలు వారిన గోడలు, శ్లాబ్..

కార్యాలయం మొత్తం బీటలు వారి ప్రమాదకరంగా మారింది. కొద్దిపాటి వర్షానికే కార్యాలయం మొత్తం తడిచి నీరు కారుతోంది. పిచ్చి మొక్కలు సైతం విపరీతంగా పెరిగిపోయి విష సర్పాలకు ఆవాస కేంద్రంగా మారింది. కనీసం టాయిలెట్‌లు కూడా పని కిరాని విధంగా తయారు కావటంతో సిబ్బంది కనీస అవసరాల కోసం బయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తరచూ శ్లాబ్ పెచ్చులు ఊడి పడిపోవటంతో పాటు వర్షాలు కురిసినప్పుడు వైర్లు తడిచి పోయి కార్యాలయంలో విద్యుత్ షాక్ తగులుతుంది. ఇప్పటికే ఇరువురు విద్యుత్ షాక్‌కు గురయ్యారు.. అయితే అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

షెడ్డులోనే విధులు..

కార్యాలయం శిథిలమై ప్రమాదకరంగా మారటంతో ఉద్యోగులు సెక్యూరిటీ కోసం ఉండే రేకుల షెడ్డులోనే విధులు నిర్వహిస్తున్నారు. రేకుల షెడ్డు కూడా బీటలు వారి ప్రమాదకరంగానే ఉండటంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఉద్యోగులు పనిచేస్తున్నారు. రేకుల షెడ్డులోకి వర్షం రాకుండా ఉద్యోగులే తలా కొంత వేసుకుని రేకులపై కవర్ వేయించుకున్నారు.

రక్షణ కరువు..

కార్యాలయం శిథిలం కావటంతో పాటు ప్రధాన మెయిన్ గేటు కూడా పాడైంది. దీంతో కార్యాలయానికి కనీస రక్షణ లేకుండా పోయింది. ఆకతాయిలు, గంజాయి బ్యాచ్, మందుబాబులు రాత్రిపూట ఇక్కడ మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అలాగే కార్యాలయం వద్ద ఉండే ఇనుప వస్తువులను అందినకాడికి తీసుకుపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ముందుగానే తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కనీసం డోర్ లేని టాయిలెట్



బయట రేకుల షెడ్డులో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి



కార్యాలయం మెయిన్ గేట్ దుస్థితి

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలకసంస్థ కల్పిస్తున్న మౌలిక వసతుల్లో తలెత్తే సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదులు – పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు.

భగవంతం కథలు సామాజిక చైతన్యానికి ప్రతీకలు



విజయవాడకల్చరల్: కథా రచయిత భగవంతం కథలు సామాజిక చైతన్యానికి ప్రతీకలని విఖ్యాత రచయిత వాడ్రేవు వీరలక్ష్మీదేవి అన్నారు. సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో శిఖామణి సెంటర్‌లోని శిఖరా స్కూల్‌లో ఆదివారం భగవంతం కథల సంపుటి లోయ చివరి రహస్యం, శీరంశెట్టి కాంతారావు నవల పరంపర పరిచయ సభను నిర్వహించారు. వీరలక్ష్మీదేవి మాట్లాడుతూ.. ప్రయోగాత్మకమైన కథలు రాయడంలో భగవంతం ముందు వరుసలో ఉంటారన్నారు. ఆయన కథలన్నీ వర్తమాన సంక్లిష్ట జీవిత రూపకాలు అని వివరించారు. శీరంశెట్టి కాంతారావు నవల గురించి యువ కవి అనిల్ డ్యానీ ప్రసంగించారు. పరిచయ సభలో సాహితీవేత్తలు బాలాంత్రపు ప్రసూన, బండ్ల మాధవరావు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు



పుష్పాలంకరణ చేస్తున్న భక్తులు



పుష్పాలను తీసుకు వస్తున్న మహిళలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో స్వయం భూ శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్ఠి ఉత్సవాలు మూడో రోజైన ఆదివారం ఘనంగా ముగిశాయి. షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు రంగావఝల ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ధర్మకర్తలు లోక కల్యాణార్థం విశేషంగా హోమం నిర్వహించారు. అనంతరం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్లలకు లక్ష పుష్పార్చన కార్యక్రమం కనులపండువగా జరిగింది. ముందుగా వివిధ రకాల పువ్వులతో భక్తులు, మహిళలు మేళ తాళాలు, డప్పు వాయిద్యాలతో మధురానగర్ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. వివిధ రకాల పుష్పాలతో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు లక్ష పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లలకు పవళింపు సేవతో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు ముగిశాయి. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు బోయిన గోపాలకృష్ణమూర్తి, హరికృష్ణ దంపతులు, లలిత భక్త బృందం, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ట్రాఫిక్‌కు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ట్రాఫిక్ సమస్యలను సృష్టించి వాహనాల రాకపోకలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు తెలిపారు. వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో ట్రాఫిక్ ఇబ్బందులపై ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం స్థానిక పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్సు, ఆటోకి సంబంధించిన పత్రాలు కలిగి ఉండటమే కాకుండా యూనిఫాం విధిగా ధరించాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని డ్రైవర్లకు సూచించారు. ప్రతి డ్రైవర్ తమ ఆటోపై సీరియల్ నంబర్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఆటో ఎక్కే మహిళల పట్ల మర్యాదగా నడుచుకోవాలని చెప్పారు. మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తాగి ఆటోలు నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రయాణికులు ఆటోల్లో మర్చిపోయిన వస్తువులు దగ్గరలోని పోలీస్ స్టేషన్ అందజేయాలన్నారు. ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మైనర్లకు అద్దె ఆటోలు ఇచ్చే ఓనర్లు పైన సైతం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఆటోలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కేజీ మార్కెట్, గద్ద బొమ్మ సెంటర్‌లో ఆటోలు ఇబ్బడి ముబ్బడిగా నిల్పకుండా వెళ్లాలని డ్రైవర్లకు సూచించారు. ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్క డ్రైవర్ పాటించాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ బి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఆంధ్రనాట్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారిణులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై గల శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన రాజేశ్వరి నృత్యనికేతన్ బృందం ఆదివారం ప్రదర్శించిన ఆంధ్ర నాట్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. నాట్యాచారిణి ఆర్ఎస్‌వై రాజేశ్వరి నేతృత్వంలో చిన్నారి కళాకారిణులు తిలోత్తమ బాయి, లక్ష్మీ చైత్ర, తనుశ్రీ, రిషిత, ఉషారాణి, పియూష, హస్విక, నవ్య, హర్షప్రియ, భవానీ తదితరులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఆంధ్రనాట్యంలో అలరింపు, వినాయక కౌత్వం, దశావతారాలు, థిల్లాన, సంధ్య సమయం, వేణుగాన రవంబు, ముద్దుగారే యశోద, జయ జగజ్జనని అంశాలకు చక్కని హావభావాలతో అభినయిస్తూ నర్తించి భక్తుల హర్షధ్వానాలను అందుకున్నారు. కార్యక్రమానికి ధూపాటి శ్రీదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించగా ఆలయ అర్చకులు చెరువు ఆదినారాయణ శాస్త్రి కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు.

సద్గురువులకు స్వర నీరాజనం



విజయవాడకల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు వాగ్గేయకారుడు గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 141వ జయంతి సందర్భంగా గాయక సార్వభౌమ సంగీత పరిషత్, స్వర ఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఆదివారం నాటి కార్యక్రమంలో పారుపల్లి రామకృష్ణయ్య పంతులు వంశానికి చెందిన సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ సద్గురువులకు స్వర నీరాజనాలు అందించారు. స్వీయ రచన వర్ణంతో ప్రారంభించి ఈ వసుధ, అప్పరామ భక్తి తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై మల్లాజోస్యుల శివతేజ, మృదంగంపై కుందుర్తి అరవింద్, ఘటంపై హరిబాబు సహకరించారు. కార్యక్రమంలో అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్, అన్నవరపు రామస్వామి పాల్గొన్నారు.


ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని, ప్రతి ఒక్కరూ శాంతి సమానత్వం అలవర్చుకోవాలని హోసన్నా మినిస్ట్రీస్ ప్రసంగీకులు పాస్టర్ రమేష్ అన్నారు. స్థానిక గద్దే వెంకట్రామయ్యనగర్‌లో ఆదివారం సాయంత్రం మెస్సీయగ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యాన కన్వీనర్ బాపట్ల గోపాలకృష్ణయ్య సహకారంతో క్రిస్మస్ ఆరాధన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్రీస్తును ఆరాధిస్తే సకల సమస్యలు తీరి సుఖసంతోషాలతో ఉంటారన్నారు. పాస్టర్ బంగార్రాజు మాట్లాడుతూ.. విశ్వాసకులు భక్తితో ప్రార్థనలు చేయటంతో పాటు సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. తోచినంతలో సేవ చేయటం అలవాటుగా చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విశ్వాసకులు ఆలపించిన క్రీస్తు గీతాలు విశ్వాసకులను భక్తితన్మయత్వంలో ముంచెత్తాయి. పెద్ద సంఖ్యలో విశ్వాసకులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

పెనమలూరు: క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని మణిపాల్ ఆస్పత్రి ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ ధర్మేంద్ర పేర్కొన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో ఆదివారం ఎన్ఎస్ఎస్ యూనిట్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ధర్మేంద్ర మాట్లాడుతూ అవగాహనతో క్యాన్సర్ రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. వ్యాయామంతో పాటు ఆహారపు అలవాట్ల పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

శ్రీ సూర్యసినీ టాకీస్ కార్యాలయం ప్రారంభం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ గవర్నర్‌పేటలో నూతన చిత్ర నిర్మాణ సంస్థ శ్రీ సూర్య సినీ టాకీస్ కార్యాలయం ప్రారంభమైంది. ఆదివారం సంస్థ కార్యాలయాన్ని ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో మంచి కుటుంబ కథా చిత్రాలను నిర్మించాలన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతమైన విజయవాడలో సినీ పరిశ్రమ మరింత అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో కోటి అనుగంటి, నిర్మాత రామిరెడ్డి కృష్ణారెడ్డి, ఆరిఫ్ పాషా షేక్, నాగుబండి పూర్ణచంద్రరావు, నవరంగ్ థియేటర్ అధినేత భూపాల్ ప్రసాద్, దుర్గా కళామందిర్ పాలేపు రామారావు, కళాటైగర్ పందిరి కృష్ణ, నవ్యాంధ్ర ఫిలిం ఛైర్మన్ ఎస్వీఎన్ రావు పాల్గొన్నారు.

వేడుకగా అక్కినేని శత జయంతి సభ



విజయవాడకల్చరల్: మన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎం.రామకృష్ణ అక్కినేని జీవిత విశేషాలను వివరించారు. ఆల్ ఇండియా అక్కినేని ఫ్యామిలీ అధ్యక్షుడు సర్వేశ్వరరావు మాట్లాడుతూ.. స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నటుడు అక్కినేని అని, ఆయన కుటుంబంమంతా చిత్రసీమకే అంకితమైందన్నారు. జానపద గాయకుడు దామోదర గణపతిరావు సభను రంజకంగా నిర్వహించారు. దేవు నరసింహారావు రూపొందించిన డాక్టర్ ఏఎన్ఆర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా అక్కినేని పాటల సినీ సంగీత విభావరి నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అక్కినేని అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మయూర్ నాథ్, కృష్ణ ప్రసాద్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కనుల విందుగా ట్రీ లైటింగ్



నోవోటెల్ హోటల్‌లో క్రిస్మస్ ట్రీ వద్ద సందడి చేస్తున్న యువతులు

గుణదల(విజయవాడతూర్పు): ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే క్రిస్మస్ పండుగను గుర్తు చేస్తూ విజయవాడ నోవోటెల్ హోటల్‌లో ట్రీ లైటింగ్ కార్యక్రమం ఆదివారం కనుల పండుగగా జరిగింది. విద్యుత్ దీప కాంతులతో క్రిస్మస్ ట్రీలను అలంకరించి, సందడి చేశారు. ఈ సందర్భంగా హోటల్ మార్కెటింగ్ డైరెక్టర్ అఖిల్ మాట్లాడుతూ.. క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆహార ప్రియులకు కావలసిన పదార్థాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ముందుగా వచ్చే క్రిస్మస్ పండుగకు పలు రకాల కేక్‌లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులకు, యాత్రికుల అభిరుచికి అనుగుణంగా వేడుకల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం ట్రీ లైటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. ఆధునిక దేవాలయాలు



మాట్లాడుతున్న శివప్రసాద్, వేదికపై గోళ్ల నారాయణరావు, లక్ష్మి తదితరులు

విజయవాడకల్చరల్: గ్రంథాలయాలను ఆధునిక దేవాలయాలుగా భావించాలని అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో గోపాలరెడ్డి రోడ్డులోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం గ్రంథాలయ పునర్వికాస ఉద్యమంపై సదస్సును నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలు చైతన్య వేదికలుగా ఉండేవని, నేడు అటువంటి పరిస్థితి లేదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించే గ్రంథాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. గ్రంథాలయ వ్యవస్థలో మార్పుల కోసం అరసం కృషి చేస్తోందన్నారు. గ్రంథాలయోద్యమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి నిర్వాహకుడు గోళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. గ్రంథాలయాలకు యువతను రప్పించడానికి ప్రణాళికలు తయారు చేయలన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి మనోహర్ నాయుడు, అధ్యక్షుడు పి.లక్ష్మయ్య, కార్యదర్శి జి.లక్ష్మి, బుక్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపక సభ్యుడు ఎస్.వెంకటనారాయణ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో నిర్వాహకులు, అతిథులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో జేకే గోజూరియో కరాటే అకాడమీ (జీకేఏ) సత్యనారాయణపురం బ్రాంచ్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విజయవాడ పటమటలోని చెన్నుపాటి రాయకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన ఈ పోటీల్లో సత్యనారాయణపురం బ్రాంచి విద్యార్థులు బి. హిమశ్రీ (11), బి.ఆధ్య శ్రీ (9), వై.వరుణ్ (9), వై.లీలానాథ్ (10), జి.సహస్ర (13) ప్రథమ స్థానంలో గెలుపొందారు. ద్వితీయ స్థానంలో ఎస్‌కె అయాన్(10), జి.క్షేత్రజ్ఞ (10), కె.లీలాకృష్ణ (11) నిలిచారు. టోర్నమెంట్‌ను డాక్టర్ యు.బ్రహ్మానందం, యు.విజయ కుమార్, కె. శ్రీనివాస్, సీహెచ్ పూర్ణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, అతిథులుగా జేకే జీకేఏ వ్యవస్థాపకుడు జె. శ్రీనివాసులు, టెక్నికల్ డైరెక్టర్ జె.హరినాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలను జేకే జీకేఏ సత్యనారాయణపురం బ్రాంచి హెడ్ కోచ్ పీవీకెఎస్ హర్ష, ఇతర బ్రాంచిల కోచ్‌లు టీవీ సాయి కుమార్, నరసింహ అభినందించారు.

14న పేరంటాలమ్మ ఆలయంలో గ్రామ సభ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో నిర్వహించనున్న సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 14వ తేదీన ఆలయ ప్రాంగణంలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.